# ఇదేం కథ కాదులే

కవిత



లేత సువర్ణ ఛాయతో సూర్యుడు పడమటి దిక్కున అస్తమించ బోతున్నాడు అప్పటివరకు వోపిగా ఎదురు చూస్తున్న వీధి లైట్లు తమ ప్రకాశాన్ని చాటుతున్నాయా అన్నట్లు ఒక్కసారిగా వెలిగాయి

లత చేతిలో రచయిత్రి పేజీలు త్వరత్వరగా తిరుగుతున్నాయి నవలా పఠనంలో నిమగ్నమైన ఆమె సారథి రాకని గమనించినట్లులేదు. వస్తూనే రెండు చేతులతో ఆమె కళ్ళు మూసేశాడు అమ్మ దొంగా ఆ మాత్రం కనుక్కోలేననుకున్నారా అంటూ గట్టిగా అతని చేతులను తొలగించ ప్రయత్నించింది సారథి చేతులు తీసేస్తూ, చీకటిపడిన విషయంకూడా గమనించలేదన్నమాట ముప్పాళ రంగనాయకమ్మగారి నవలేమైన చేతికందిందా యీరోజు ? చిన్నగామందహాసంచేస్తూ అన్నాడు లత ముప్పాళ్ళ రంగనాయకమ్మ నవలలంటే ప్రాణం విడుస్తుందన్న విషయ మెరిగిన సారథి

ఉండండి. లైటువేస్తా ముసిముసిగా నవ్వుకుంటూ స్విచ్‌వద్ద కెళ్ళిన లత ఒక్కసారిగా వెనక్కి పడబోయింది మరుక్షణం సారధి బాహుద్వయంలో చిక్కుకుంది ఆమె చేతివేళ్ళు అతని చేతిలో వున్నాయి బాగా షాక్ కొట్టినట్లుంది కదూ? అనునయంగా అడిగాడు కొంచెంగా షాక్ కొట్టింది యిప్పుడేం లేదంటూ అతనినుండి విడిపించుకోబోయింది కాని అతను మరింతగట్టిగా ఆమెను తన హృదయానికి అదుముకున్నాడు. అనుకోని ఈ సంఘటనకు బెదరిన లేడిపిల్లలా ఆమె పారిపోయింది ఆమె వెళ్ళినవైపుచూస్తూ నిల్చుండిపోయాడు సారథి.

ఏం నాయనా సారథీ అలానే నిల్చుండిపోయావు? కూర్చోమంటూ సరస్వతమ్మగారు అమ్మాయ్ లతా మీ మాష్టారు వచ్చారంటూ పిలిచారు.

లత యేమీ యెరుగనట్లే సారధి కూర్చునివున్న రూమ్‌లోపలికి వచ్చింది సారథి క్రీగంట ఆమెని చూస్తూ నవ్వుకున్నాడు ఆమె సిగుతో తలవంచేసుకుంది. సరస్వతమ్మగారు కాఫీతో ప్రత్యక్షమయ్యారు.

లతా నీవూ తీసికో కాఫీ " సారధి అందివ్వబోతూండగా నేను నాలుగ్గంటలకే తాగానుఇప్పుడేం కాఫీ నాకింకా మీరుతాగండి ' అన్నది సరస్వతమ్మగారు పనుందంటూ వెళ్ళిపోయారు

మీ ఆడ వాళ్ళందరికీ ఆ ముప్పాళ రంగనాయకమ్మ నవలలంటే అంతపిచ్చేమిటీ అతను ఆమె ముఖంలోకి చూస్తూ అడిగాడు. ఏం? ఆడవాళ్ళకే అని ఎందుకనుకుంటున్నారు? మగవాళ్ళు చదవరా? సూటిగా చూస్తూ అన్నది చదవరనికాదు నేననేది ఎక్కువమంది ఆడవాళ్లు ఆమె నవలలంటే పడిచస్తారు బహుశా ఆమెని ఆడవాళ్ళ తరఫున ఒక దేవతగా లెక్కించవచ్చు ఎప్పుడూ మగవాళ్ళనుదుయ్యబడుతూరాస్తూండడంవల్ల కావచ్చు అతను ఆగాడు ఇలాంటి కామెంట్స్ లత ఇప్పటికెన్నో విన్నది అందుకే తొణక్కుండా దుయ్యబడుతుందనే ఎందుకనుకోవాలి? వున్న విషయాల్ని రాస్తుందనుకోకూడదూ? ఏమో ఆ పేకమేడలు నవల చదివే వుంటావు ఏ మగవాడైనా ఆడదాన్ని అంతగా హింసిస్తాడంటే నేను చస్తే నమ్మను గంభీరంగా అన్నాడు

లత వెంటనే అందుకుంది అసలు అది కథ కాదట. నిజంగా జరిగిన విషయాన్ని కొంచెం మార్పు చేసి రాసిందట ఆ విషయం తెలుసా మీకు?

నే నమ్మను

సరే నమ్మని వాళ్ళని నమ్మించప్రయత్నించడం వ్యర్థం ఆ సంభాషణ యింకెంత వరకు పోయేదో ఆనందరావుగారి రాకతో అంతటితో ఆగిపోయింది

ఏం సారథీ మాలతి ఈ సంవత్సరం మంచి మార్కులతో పాస్ కావాలి మరి పాఠం రోజూ చెబుతున్నావా ఆనందరావుగారు రోజూ ఈ విధంగానే అడుగుతూ వుంటారు సారథీ లతా యిద్దరూ వినయంగా తలూపుతారు

* * *

అది అలహాబాద్ మహానగరం ఆ నగరంలో లా కాలేజి ప్రిన్సిపాల్ ఆనందరావుగారు. వారి సతీమణి సరస్వతి. వారికి సంతానంలేదు వారింటనే పెరుగుతోంది వారి మేన కోడలు లతాదేవి. లతాదేవి బి ఏ ముగించి యమ్ యల్ బి సెకండ్ యియర్ చదువుతోంది. ఆమెకి సారధి అనేఅతన్ని ట్యూటర్‌గా పెట్టించారు ఆనందరావు. సారధికూడ అదే కాలేజీలో పనిచేస్తున్నాడు సారధి లతలమధ్య అనురాగం పెంపొందుతూంది ఆనందరావుగారుగాని సరస్వతమ్మగారుగాని వారి అనురాగానికి యెట్టి ఆటంకమూ కల్గించరు బహుశా ఆ జంట చూడముచ్చటగా వుంటుంది

ఆ రోజు సారధివచ్చి పాఠం మొదలు పెట్టేదు లత మధ్యమధ్య తన సందేహాలను. నివృత్తిచేసుకోవటం అలవాటు ఆ రోజుకూడ కొన్నిప్రశ్నలడిగింది మాష్టారూ మధ్యాహ్నంమీరు క్లాసులో భార్యాభర్తా విడాకులు తీసుకుంటే భర్త యిష్టపడితే భార్య

యిష్టపడకపోతే భర్త జీతంలో సగం భార్యకు చెందుతుందని చెప్పారు కాని భార్య యిష్టపడి భర్తకూడ యిష్టపడితే కేసు యెలా వుంటుందో చెప్పుతారూ అంది లత.

అవును అవిషయంచెప్పడం మర్చిపోయాను వెరీ సింపుల్ యిద్దరూ హాయిగా విడిపోవచ్చు కాని భర్త సగం జీతం భార్యకు రావడం లాంటి వేమీకుదరవు ఈకేసులో సారధి విడమర్చిచెప్పాడు.

ఇక యీరోజు కీలెసన్ చాల్లెండిమాష్టారూ రేపు చెపుదురుకాని లత ఆవలించింది. నిద్రాదేవి నప్పుడే ఆహ్వానించేస్తున్నావన్న మాట పుస్తకం మూసేస్తూ లేచాడు అతను వెళ్ళినవైపు చూస్తూ నిల్చుండి పోయింది. అయ్యో మాష్టారు బుక్‌లో నుండి పడినట్లుం దీ పేపరు. క్రిందపడిన పేపరు తీసింది లత.

పద్మను నేను పెళ్ళిచేసుకోలేను ఇది నా బలహీనతే కావచ్చు నా బాధ్యత నిర్వర్తించడానికి నేనామెను పెళ్ళి చేసుకున్నా మనస్ఫూర్తిగా ప్రేమించలేను. నాకూ కోరికలున్నాయ్ బీదవాడ్ని కావచ్చు. అలా అని బీదవాడికి ప్రేమించేహక్కు లేదా ? నా భార్యా నేను కోరుకున్నట్లుగా వుండాలి'

చదివిన లత గట్టిగా నిట్టూర్చింది నిద్ర పట్టక అటూ యిటూ కదులుతోంది ఆలోచనలు జోరీగల్లాగా ముసురుకుంటున్నాయి ఫలితం కోసం ఎదురు చూస్తోంది తన జీవితం చివరికెలా గవుతుందో నన్న ఆందోళన చెందసాగింది ఎప్పటికో నిద్ర పట్టింది. సారధిని తనను ఏవేవో భయంకర శక్తులు వేరు చేస్తున్నట్లు కలలు కలత నిద్రే ఆ రాత్రి ఆమెకు లభించింది

రెండవరోజు ఇంపాలా బీచిలో ఆగింది సాయం సమయం లతా సారధీ యిద్దరూ బీచిలో ప్రక్క ప్రక్కనే కూర్చున్నారు వేళ్ళతో యిసుకలో గీతలు గీస్తోంది సారధి ఆమె ముఖంలోకి చూస్తున్నాడు నీతో చాల ముఖ్యమైనవిషయం చెప్పాలనుకుంటున్నాను నీ సలహా కోరుతున్నాను ఉపోద్ఘాతంగా మొదలుపెట్టాడు

ఆమె గుండెవేగం హెచ్చింది ఏం చెప్పుతాడోనని అతనివైపు చూస్తోంది అతని చూపులు ఆమెని కలవరపరచాయి సిగ్గుతో ముడుచుకుపోయింది అతను ఆమె ముంగురులు సవరిస్తున్నాడు నిజంగా నీవీ రోజు నాకోసం దివినుండి దిగివచ్చిన దేవతలాగున్నావు మెల్లగా అంటున్నాడు ఆమె కనురెప్పలు బరువుగా వాలిపోయినయ్ పడవలవాళ్ళు వాళ్ళవాళ్ళ పడవల్ని ఒడ్డుకుచేర్చుకుంటున్నారు మబ్బుదట్టంగా పట్టినందువల్ల మసక చీకట్లు ఆవరించినయ్ టపటప చినుకులు ప్రారంభమయ్యాయి ఆమె చలికి అతనికి దగ్గరగా వచ్చింది ఇద్దరూ కారుదగరకు నడిచారు. డోర్ తెరవబోయిన ఆమె చేతినలాగేపట్టుకున్నాడు అతని శరీరం విచిత్రంగా పులకించింది ఆమె అంగసౌష్టవం అతన్ని పిచ్చివాణ్ణి చేస్తోంది ఆమె చిత్రంగా అతన్ని పెనవేసుకుంది. చిగురుటాకుల వంటి ఆమె లేత పెదవులపై అతనిపెదవులు సుతారంగా చుంబించ బోయినయ్ ఎక్కడో పిడుగు పడినట్లుంది ఇద్దరూ విడిపోయారు. యౌవనంలో వున్న వారిద్దరి నరనరాలకూ వ్యాపించిన విద్యుత్తు ఒక్కసారిగా వదిలినట్లైంది

సారధి లతతో ఆ విషయమై ప్రస్తావించడానికి సందేహిస్తున్నాడు ఎలాగో ధైర్యం చేసి చెప్పాలనుకున్నప్పుడు సమయం కలిసి రావడం లేదు లతను చూస్తే అన్ని విషయాలు మర్చిపోతాడు ఆమె కళ్ళల్లోని మెరుపుకి చకితుడౌతాడు అలా ఆమెని చూస్తుంటే అతని విచారమంతా మాయమౌతుంది

సారధి ఏ విషయమైతే చెప్పడానికి తటపటాయిస్తున్నాడో ఆ విషయం లత వూహించగలదు అతని నోటినుండి వచ్చే ఆ మాటలకోసం ఆమె వేచియుంటోంది ఆమె ఓపిక తగ్గిపోయింది ఇక ఏ విధంగానైనా తనే ఆ విషయాన్ని అతనితో చెప్పాలని నిర్ణయానికొచ్చేసింది ఆరోజు లత.

* * *

పద్మలతా నీ కథ పగటి కలలు ప్రతిభ వారపత్రికలో వేశారు చూశావా అబ్బ ఎంత బాగ రాశావు మనోరమా శ్యామలా సుశీల సంతోషంతో మెచ్చుకున్నారు వాళ్ళంతా పద్మలత క్లాస్‌మేట్స్ బి ఏ సెకండ్‌యియర్ చదువుతున్నారు పద్మలత ప్రకాశరావుగారి యేకైక పుత్రిక. తల్లీ తండ్రీ ఆయనే లక్షలకు వారసుడు.

నేను మీకంటే ముందే చూశాను చిన్నగా నవ్వుతూ జవాబిచ్చింది పద్మలత పార్టీ యిమ్మంటూ అందరూ మూగారు. పద్మకు పెళ్ళిచూపులు చాల అందంగావున్నాడు. పద్మ అతన్నే తన భర్తగా మనసులో నిశ్చయించుకుంది ప్రకాశరావుగారు కాబోయే అల్లుడ్ని లండన్ పంపడానికి అంగీకరించారు వాళ్ళ కోరికపై లండన్ నుండి వచ్చాక వివాహంచేసుకుంటా నన్నాడా కాబోయే అల్లుడు సంతోషంగా అంగీకరించారు ప్రకాశరావుగారు వెళ్ళిపోయే రోజయినా తనతోయేమన్న చెబుతాడేమోనని యెదురుచూసింది లత కాని అలా జరగలేదు ఒక్కమాటకూడ ఆమెతో మాట్లాడలేదు సిగ్గుకాబోలునని సరిపెట్టుకున్నారు

పద్మ అతన్ని గురించి కలలు కనేది తనకు ఉత్తరాలేమైనా వ్రాస్తాడేమోనని ఎదురుచూసేది. కాని అవి ప్రకాశరావుగారి పేరునవచ్చేవి కొన్నాళ్ళకది కూడలేదు ఒకసారి అనుకోకుండా ఓ ఉత్తరం వచ్చింది

నన్ను క్షమించండి అని అడిగే అర్హత నాకు లేదు. పద్మని నేను వివాహం చేసుకోలేను కారణం అడగొద్దు మీరు లక్షలకు వారసులు, మంచి సంబంధం తీసుకురాగలరు మీరు నాకు యిచ్చిన డబ్బు త్వరలో తిరిగి యిచ్చేస్తాను

ప్రకాశరావుగారు గుండెజబ్బు మనిషి ఈవార్త విన్న వెంటనే అతనీ లోకాన్ని విడచాడు

పద్మమామయ్య ఆనందరావుగారు ఆమెని తిరిగి మనిషిని చేయగలిగారు యల్ యల్. బి చదివిస్తున్నారు ఆరోజు పద్మ వాళ్ళ క్లాసుకి క్రొత్త మాష్టారు వస్తారని విద్యార్థినీ విద్యార్థులంతా ఎదురు చూస్తున్నారు. బట్టతలతో మందపాటి కళ్ళద్దాలతో కొంచెం బొజ్జరాబోయే ఆయన్ని గురించిన వారి వూహ లివి

వారి వూహల్ని తారుమారు చేస్తూ అందమైన యువకుడా క్లాసులో అడుగుపెట్టాడు స్టూడెంట్స్ కళ్ళు ఆశ్చర్యాన్ని ప్రకటించినయ్' పద్మ మ్రాన్పడిపోయింది అవును నేను పొరపడటం లేదు అయనే ఆయనే ఆమె మనస్సు ఆక్రోశించింది తనకు బాగా గుర్తు.అరడుగులవిగ్రహం. ఎత్తుకు తగిన లావు గుండెల్లోకి చొచ్చుకునేట్టు చూచే ఆ అందమైన కళ్ళు. ఇకపైన ఆలోచించలేకపోయింది చివరి పీరియడ్ ఎలాగో గడిపి యింటి కొచ్చేసింది

ఆనందరావుగారు లత ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్నారు వాళ్ళిద్దరూ మూడో మనిషికి తెలియకుండా యేదో రహస్యంలా మాట్లాడుకున్నారు లత కన్నీళ్ళు తుడిచి ఓదార్చారు సమయంకోసం నిరీక్షిస్తోంది లత. తన సమస్య తీరే విధానం ఆలోచిస్తోంది.

సారధీ లతలమధ్య స్నేహలత అల్లుకుపోయింది వారి అనురాగం మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లాలని ఆనందరావుగారు సరస్వతమ్మగారు మనసారదీవించారు

ఆరోజు లత సారధి రూము సర్దుతోంది. సారధీ స్నానం చేస్తున్నాడు అతని డైరీలోనుండి ఒకటి రెండు పేజీలు రాలి క్రిందబడ్డాయి రెండు మూడు సంవత్సరాల క్రితం డైరీ అది ఆ పేజీలో యిలా వుంది కొన్ని సంవత్సరాలనుండి వేధిస్తున్న ప్రశ్నకు జవాబిది పద్మను వివాహమాడలేను నేనూ మగవాణ్ణి నాకూ కోరికలుంటాయి బీదవాడికీ ప్రేమించే హక్కువుంది నాకూ నా భార్య అందంగా వుండాలనివుంది పద్మను ఆరోజు చూశాను. ఆ ఆకారం చూస్తే యిప్పటికీ నాకు భయంగావుంది శరీరం ఎముకల గూడులావుంది. కళ్ళు వేసవికాలం గుంటూరుబావులంత లోతుగా వున్నాయ్ చేతులు కాళ్ళు చీపురు పుల్లల్లా వ్రేలాడుతున్నాయ్ అస్థిపంజరానికీ ఆమెకీ తేడా లేదు ఆమెని నేను వివాహం చేసుకోవాలా ? అసంభవం

లత కళ్ళు వర్షించడానికి సిద్ధంగా వున్నాయ్ నిజమే టైఫాయిడ్ నన్నాస్థితికి తెచ్చింది అనుకొంది

* * *

రెండవరోజు లత వస్తూనే నేనోకథ రాశాను. సుఖాంతం చేయమంటారా ? దుఃఖాంతం చేయమంటారా? అన్నది ముందు కథ చదవనీ తరువాత చెబుతా కథ చదివిన సారధికి ముచ్చెమటలు పట్టినయ్ లత రెండు చేతులూ పట్టుకొని నన్ను క్షమించగలిగితే క్షమించు. అడిగే అర్హతకూడ ఈ దౌర్భాగ్యుడికి లే దంటూవాపోయాడు

అయ్యో కథ చదివి అంత యిదై పోతారేం లత గంభీరంగా అన్నది ఇదేం కథ కాదులే లతా నా కామాత్రం జ్ఞానం లేదనుకున్నావా ? ఆమెని గుండెల కదుముకుంటూ అన్నాడు లత అతన్ని అల్లుకుపోయింది. పార్కులో రేడియోలో భానుమతి గొంతు శ్రావ్యంగా వినవస్తోంది. మనసున మల్లెల మాలలూగెనే —

★